

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

# ఉద్యమకారుడిని గెలిపించండి

- ఎమ్మెల్యే మాణిక్‌రావు
- ఝరాసంగం మండలంలో గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం

ఝరాసంగం, ఏప్రిల్ 25: ఉద్యమకారుడైన ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపిస్తే జహీరాబాద్ అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. గురువారం ఝరాసంగం మండలంలోని కృష్ణాపూర్, బర్దీపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు బొగ్గుల సంగమేశ్వర్, గ్రామ మాజీ సర్పంచ్ అమర్జీత్, పార్టీ ప్రెసిడెంట్ మూసాపటేల్, మండల నాయకులు ప్రభుపటేల్, శ్రీనివాస్ రెడ్డి, సంగారెడ్డి, కిషన్, సంగన్న, రామన్న, అసిఫ్ పటేల్, రవి, రఘుపతి, మైను పటేల్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెదక్ గడ్డపై గులాబీ జెండా ఎగరాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

రామచంద్రాపురం, ఏప్రిల్ 25: మెదక్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆర్సీపురం డివిజన్‌లోని లక్ష్మీగార్డెన్స్‌లో ఆర్సీపురం, భారతీనగర్ డివిజనల్ల ముఖ్యకార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం లక్ష్మీగార్డెన్స్‌లో రెండు డివిజన్‌లకు సంబంధించి సన్నాహక సమాశం నిర్వహిస్తున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. దశాబ్ద కాలంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని గడపగడపకూ వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. పార్టీ నాయకులు బూతు స్థాయి నుంచి ప్రతి కార్యకర్తతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఆర్సీపురం, భారతీనగర్ డివిజన్ల నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి భారీ మెజార్టీ తీసుకురావాలని కార్పొరేటర్లు పుష్పానగేశ్, సింధూఆదర్శ్‌రెడ్డిలతోపాటు పార్టీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు సఫానదేవ్, శంకర్‌యాదవ్, అంజయ్య, పరమేశ్, గోవింద్, ఐలేశ్, జగన్నాథ్‌రెడ్డి, బేకు యాదయ్య, అజీముద్దీన్, కృష్ణకాంత్, ప్రమోద్‌గౌడ్, బూన్, మల్లేశ్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.




ఓపెన్ స్కూల్ పరీక్షా కేంద్రం వద్ద అభ్యాసకుల సందడి

# ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 25: జిల్లాలో ఓపెన్ స్కూల్ వార్షిక పరీక్షలు గురువారం సజావుగా ప్రారంభమయ్యాయి. ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఇంటర్మీడియట్ తెలుగు, ఉర్దూ, హిందీ పరీక్షలకు 3,556 మంది అభ్యాసకులకు 3,195 మంది హాజరయ్యారు. 361 మంది గైర్హాజరయ్యారు. 90 శాతం హాజరు నమోదైంది. పదో తరగతికి సంబంధించి తెలుగు, మరాఠీ, కన్నడ పరీక్షలకు 1,472 మంది అభ్యాసకులకు 1,327 మంది హాజరుకాగా 145 మంది గైర్హాజరయ్యారు. 90 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన ఇంటర్మీడియట్ అరబిక్ పరీక్షకు మొత్తం 94 మంది అభ్యాసకులకు 81 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. దీంతో 86 శాతం హాజరు నమోదైంది. జిల్లాలో మొత్తం 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పదో తరగతికి సంబంధించి 10 కేంద్రాలు, ఇంటర్మీడియట్‌కు 15 పరీక్షా కేంద్రాలు ఉండగా, అన్ని పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు పరీక్షలు సజావుగా జరిగాయి. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఎస్‌ఎస్‌సీ 8 పరీక్షా కేంద్రాలు, ఇంటర్ 6 పరీక్షా కేంద్రాలను సందర్శించగా, ఎగ్జామినేషన్ కమిటీ ఎస్‌ఎస్‌సీ 2 పరీక్షా కేంద్రాలు, ఇంటర్ 3 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు సంబంధించి ఆయా కమిటీలు రెండు చొప్పున పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యాశాఖ అధికారులు ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టడంతో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభ్యాసకులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారు.

# రింగురోడ్డుపై ఘోర ప్రమాదం

- లారీని ఢీకొన్న కారు
- మంటల్లో చిక్కుకొని డ్రైవర్ సజీవదహనం



ఘటనాస్థలంలో కాలిపోతున్న కారు, లారీ

పటాన్‌చెరు, ఏప్రిల్ 25: పటాన్‌చెరు ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ సమీపంలో లారీని వెనుకనుంచి కారు ఢీకొని చెలరేగిన అగ్ని ప్రమాదంలో కారు డ్రైవర్ సజీవ దహనం అయ్యారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామ పరిధిలోని ఓఆర్‌ఆర్‌పై రోడ్డు ప్రమాదం సంభవించింది. బీరంగూడలో నివసించే కట్టెకొళ్ల శిరీశ్(33) వ్యాపారి. గురువారం ఉదయం సమయంలో నగరానికి వెళ్లేందుకు రింగ్‌రోడ్డుపైకి వెళ్లిన శిరీశ్ కారు ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఢీ కొట్టింది. ప్రమాద తీవ్రతకు మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో శిరీశ్ తీవ్రంగా కాలిపోయి మరణించాడు. ఈ ఘటనలో లారీ సైతం మంటల్లో చిక్కుకుంది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. శిరీశ్ సోదరుడు కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



హుస్సేల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

## అంబేద్కర్ బాటలో నడవాలి

న్యాల్‌కల్, ఏప్రిల్ 25: బీఆర్ అంబేద్కర్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని జహీరాబాద్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ వ్యవస్థాపకుడు మొగులయ్యగౌతం అన్నారు. గురువారం మండలంలోని హుస్సేల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత అంబేద్కర్ ఆలోచన విధానంలో సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సమతా సైనిక్‌దళ్ నాయకులు వైజ్యనాథ్, బాల్‌రాజ్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మచ్చేందర్, అంబేద్కర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు నర్సింలు, గ్రామ సంఘం నాయకులు రాములు, శేఖర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్‌ఎస్ సమావేశం

గుమ్మడిదల, ఏప్రిల్ 25: ఉమ్మడి జిన్నారం మండలంలోని గడ్డపోతారం పుల్లిగిల్ల పంక్షన్‌హాలులో బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు మహ్మద్‌హుస్సేన్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం గడ్డపోతారంలోని పుల్లిగిల్ల ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మెదక్ బీఆర్‌ఎస్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిన్నారం మండంలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, గ్రామ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ఎన్నికలకు పకడ్బందీ నిఘా

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పటిష్ట చర్యలు
- చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు
- ఇప్పటివరకు హుస్సేల్లి చెక్‌పోస్ట్ వద్ద రూ. 22.89 లక్షలు నగదు, 77.63 లీటర్ల మద్యం స్వాధీనం



మాడ్గి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న చీరాగ్‌పల్లి పోలీసులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 25: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని హుస్సేల్లి, మల్గి గ్రామ శివారులోని కర్ణాటక-తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. నిత్యం ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోని వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎటువంటి రసీదులు, పత్రాలు లేకుండా ఆయా రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి తరలిస్తున్న మద్యం, నగదును పట్టుకొని సీజ్ చేస్తున్నారు.

***నిత్యం ముమ్మర తనిఖీలు***

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సంగారెడ్డి ఎస్పీ రూపేశ్ ఆధ్వర్యంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, రూరల్ సీఐ నయిమోద్దీన్, హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు పర్యవేక్షణలో మండలంలోని హుస్సేల్లి, మల్గి గ్రామాల్లోని అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద 24 గంటలపాటు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కర్ణాటక ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదును మండలంలోని హుస్సేలి చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీల్లో పట్టుకుంటున్నారు. ఎలాంటి రసీదులు లేకుండా రూ.49 వేల నుంచి నగదును తరలిస్తున్న ప్రజల నుంచి ఒక్క హుస్సేల్లి చెక్‌పోస్ట్ వద్ద ఇప్పటివరకు రూ.22.89 లక్షల నగదు, 77.63 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు.

***సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి***

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలీసు శాఖ మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించింది. మండలంలోని రేజింతల్, గుంజోట్టిని సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. ఇప్పటివరకు మండలంలో 55 మంది పాత నేరస్తులను అరెస్టు చేసి బైండోవర్ చేశారు. ఎన్నికల సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. వీటిపై పోలీసులు నిఘాను పటిష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించేందుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

### రూ.2.86 లక్షలు స్వాధీనం



హుస్సేల్లి చెక్‌పోస్టు వద్ద నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 25: మండలంలోని హుస్సేల్లి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గురువారం రూ.1.26 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. హద్నూర్ ఎస్‌ఐ రామనాయుడు కథనం ప్రకారం.. కర్ణాటకలోని బీదర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న రెండు వాహనాల్లో రూ.1.26లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో చెక్‌పోస్టు పోలీసులు నగదును సీజ్ చేసినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు. మొగుడంపల్లి మండలం చీరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాడ్గి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గురువారం రూ.1.60లక్షల నగదును పట్టుకున్నట్లు చీరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

### నిత్యం తనిఖీలు చేస్తున్నాం



లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నిరంతరం తనిఖీలు చేపడుతున్నాం. మండలంలోని హుసేల్లి, మల్గి గ్రామాల శివారులో ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి తెలంగాణలోకి వస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాం. ఆయా రాష్ట్రాల నుంచి మద్యం, నగదు ఇతర కానుక వస్తువులు తరలించకుండా చర్యలు తీసుకుంటున్నాం. 24 గంటలపాటు పటిష్ట నిఘా ఉంచుతున్నాం. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమంగా మద్యం, నగదు లేదని నిర్ధారించుకున్న తర్వాతనే వాహనాలను వదిలిపెడుతున్నాం.

– రామానాయుడు, హద్నూర్ ఎస్‌ఐ

# కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయికుమార్


మునిపల్లి, ఏప్రిల్ 25: అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్నదని, ఎంపీ ఎన్నికల్లో ఓటుతో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఖమ్మంపల్లి శివారులోని శ్రీసాయి గార్డెన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలీ అనిల్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో అమలు కానీ హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను ఓడించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, మండల ఉపాధ్యాక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్, యువత అధ్యక్షుడు ఆనంద్ పాల్గొన్నారు.

# ఉత్సవాలకు వీరభద్రేశ్వరాలయం ముస్తాబు



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- భక్తులకు సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి



రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర స్వామి, భద్రకాళి అమ్మవారు

రాయికోడ్, ఏప్రిల్ 25: రాయికోడ్ వీరభద్రేశ్వర స్వామి, భద్రకాళి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. శనివారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాతరకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. 27వ తేదీన ద్వజారోహణం, శిఖర పూజ, 28న స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ, అగ్నిగుండం, రథోత్సవము, పెద్దరాజు పెద్దమ్మ భయలు నాటకం ఒకటో భాగం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. 29న బిల్వార్చన, 30న కుంకుమార్చన, పెద్దరాజు పెద్దమ్మ రెండో భాగం భయలు నాటకం, మే1న ఆకులపూజ, 2న రథోత్సవం, పెద్దరాజు పెద్దమ్మ భయలు నాటకం మూడో నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ఐదు రోజుల పాటు భక్తులకు అన్నదానం ఉంటుందని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో సామూహిక రుద్రాభిషేకాలు

గుమ్మడిదల, ఏప్రిల్ 25: కృష్ణానంద ఆశ్రమంలో గురువారం తోగుట పీఠాధిపతి మాధవానంద పర్యవేక్షణలో భక్తులు రుద్రాభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం మండల కేంద్రమైన గుమ్మడిదలలోని శ్రీకృష్ణానంద ఆశ్రమంలో భక్తులు సామూహికంగా రుద్రాభిషేకాలు ఆచరించారు. అనంతరం స్వామిజీ ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈసందర్భంగా మాధవానందస్వామిజీ మాట్లాడుతూ భక్తులు నిత్యం దైవనామస్మరనతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని, మనస్సు ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈసంవత్సరంలో శ్రీమాత్రేనామః జపం చేయాలని భక్తులకు సూచించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

# ఓటరు స్లిప్పుల పంపిణీ



న్యాల్‌కల్‌లో ఓటర్ స్లిప్పుల పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ భూపాల్

న్యాల్‌కల్, ఏప్రిల్ 25: మండలంలోని గ్రామాల్లో ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్‌ను పకడ్బందీగా పంపిణీ చేయాలని తహసీల్దార్ భూపాల్ సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. గురువారం న్యాల్‌కల్‌లో ఓటరు స్లిప్పుల పంపిణీని పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాలకు 48,163 ఓటరు స్లిప్పులు వచ్చినట్లు తెలిపారు. ఓటరు స్లిప్పుల పంపిణీ మండలంలోని అన్ని గ్రామాల్లో సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో బూత్ లెవల్ అధికారులు, సిబ్బంది పంపిణీ చేస్తున్నారన్నారు. ఈ నెల 28వ తేదీలోగా మండలంలో ఓటరు స్లిప్పుల పంపిణీని పూర్తి చేసేలా సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్లిప్పుల పంపిణీలో ఓటర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సంబంధిత అధికారులు, సిబ్బంది చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దుర్గయ్య, బూత్‌లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఓటరు స్లిప్పుల పంపిణీ**

కోహీర్, ఏప్రిల్ 25: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు స్లిప్పులను అందజేశారు. గురువారం ఆయా గ్రామాల్లో చేపట్టిన ఓటరు స్లిప్పుల పంపిణీని ఆర్‌ఐ సత్యనారాయణ, మాన్‌సింగ్ పర్యవేక్షించారు. ఓటర్లందరికీ స్లిప్పులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో బీఎల్వోలు పాల్గొన్నారు.

**సక్రమంగా పంపిణీ చేయాలి**

కంది, ఏప్రిల్ 25: కంది మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటర్ స్లిప్‌లను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ విజయలక్ష్మి బీఎల్‌ఓలకు సూచించారు. గురువారం కందిలో సమావేశం నిర్వహించి బీఎల్‌ఓలకు ఓటర్ స్లిప్‌లను అందజేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నేరుగా ఫిర్యాదు చేయవచ్చు

**జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి**

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 25: ఎన్నికల సంఘం నిబంధనలను అతిక్రమించే వారిపై ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాధుల స్వీకరణకు ఎన్నికల వ్యయ పరిశీలకులు కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటారని జిల్లా ఎన్నికల అధికారి, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి గురువారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన వ్యయం, ఖర్చులు, డబ్బుల పంపిణీ, మద్యం పంపిణీ తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను చేయవచ్చన్నారు. సాధారణ ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జి.తివారి ఐఏఎస్‌ను(79956 92890), వ్యయ పరిశీలకుడు మోతీలాల్ ఎస్ శెట్ ఐఆర్‌ఎస్(79956 92887)ను సంప్రదించవచ్చన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాధులు, సలహాలు, సూచనలపై రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు వీరిని నేరుగా కలిసేందుకు ప్రత్యేక కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు ఎన్నికల సంఘం చేపడుతున్నదని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లోకి కొడకంచి ఎంపీటీసీ



కాంగ్రెస్‌లో చేరుతున్న కొడకంచి ఎంపీటీసీ సంతోష

జిన్నారం, ఏప్రిల్ 25: కొడకంచి ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ నాయకురాలు సంతోషామహేశ్ కాంగ్రెస్‌లో చేరారు. గురువారం కాం గ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌ డ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలను చూసి వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ లో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ సంతోషమహేశ్‌కు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ గౌడ్, వైస్ ఎం పీపీ గంగురమేశ్, ఎంపీటీసీ జనాబాయి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నర్సింలు, మహేశ్‌గౌడ్, అజారుద్దీన్, రవీందర్, సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.



అల్లాదుర్గం-మెటల్‌కుంట ప్రధాన రోడ్డు మార్గంలో గుల్ మొహర్ చెట్లకు విరబూసిన పూలు

# హరితహారం.. దారి పొడవునా ఆహ్లాదం

**వాహనదారులను కట్టిపడేస్తున్న పూల సోయగం**

న్యాల్‌కల్, ఏప్రిల్ 25: తోరణం కట్టినట్లు దారి పొడవునా ఉన్న గుల్‌మొహర్ పచ్చని చెట్ల వరుస, అరుణ వర్ణంలో పూసిన పూలు వాహనదారులను కట్టిపడేస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా నాటిన గుల్‌మొహర్ చెట్లు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. భానుడి భగభగల నుంచి నీడనిస్తూ, చల్లదనాన్ని అందిస్తున్నాయి. మండలంలోని హుస్సేల్లి-గుంజోట్టి గ్రామాలతోపాటు ముంగి గ్రామ శివారులోని అల్లాదుర్గం-మెటల్‌కుంట ప్రధాన రోడ్డు మార్గంలో ఇరువైపులా గుల్‌మొహర్ చెట్లకు విరబూసిన ఎర్రటి పూలు కనివిందు చేస్తున్నాయి. ఆయా రోడ్డు మార్గాల్లో ప్రయాణించే బాటసారులకు చల్లటి అనుభూతిని కలిగిస్తున్నాయి.



హుస్సేలి గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో..